క్లుప్తంగా

యువతి వివాహానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేసిన శంకర్‌నాయక్

కడ్తాల్: పేదింటి ఆడబిడ్డ వివాహానికి బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్ చేయూతనందించారు. గురువారం మండల పరిధి గానుగుమార్లతండాకు చెందిన నేనావత్ దేశ్యానాయక్– బాజిలీ దంపతుల కూతురు మాధవి వివాహానికి హాజరై రూ.1లక్ష ఆర్థిక సాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందజేశారు.

రూ.34 లక్షలకు తైబజారు వేలం


తైబజారు వేలంలో కమిషనర్ తదితరులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ తైబజారుకు రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. గతేడాది రూ.13.05 లక్షలు కాగా.. ప్రస్తుతం రూ.34 లక్షలు పలికింది. 2025– 26 సంవత్సరానికి గురువారం కమిషనర్ శంకర్ ఆధ్వర్యంలో తైబజారు వేలం పాట నిర్వహించారు. పాటలో 31 మంది పాల్గొన్నారు. వేలంలో రూ.34 లక్షలకు తైబజార్‌ను పట్టణానికి చెందిన జనిగల గిరియాదవ్ దక్కించుకున్నారు. చికెన్ వ్యర్థాల సేకరణను రూ.4.91 లక్షలకు నర్సింహ కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ దామోదర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కపూటే నిర్వహించాలి


పాఠశాలలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ పాండు

ఆమనగల్లు: నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ పాండు హెచ్చరించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నారని ఎంఈఓ కార్యాలయంలో ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఆయన గురువారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న పద్మ అనిల్

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో ఈసరి రాజు శ్రీమంతపురం రాము జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు కండె జగతయ్య, శేఖర్‌రెడ్డి, సుదర్శన్, మహేశ్, యాదయ్య, వెంకటేశ్, రమేశ్, నరేశ్, గిరి, ప్రసాద్, నర్సింహ, చెన్నయ్య, చంద్రయ్య, పర్వతాలు, రాము, శివ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు


మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించిందని సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ మాదిగ అన్నారు. వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో పట్టణంలో గురువారం సమితి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు. అనంతరం రాజీవ్‌చౌరస్తా వద్ద మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు వస్పుల సాయిలు, పులికంటి మైసయ్య, మల్లెపోగు మల్లేశ్, శ్రీరాములు, అరుణ్, కిరణ్, శ్రీశైలం, బీమయ్య, జంగయ్య, వెంకటేశ్, గిరి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విలీనంపై ఊహాగానాలు

- ఆదిబట్ల మున్సిపాలిటీ గ్రేటర్‌లో కలయికపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- స్థానిక ఎన్నికల కోసం ఎదురు చూపు
- ఆశావహుల్లో నెలకొన్న సందిగ్ధం
- బల్దియాలో కలిపినా పోటీకి సై అంటున్న వైనం


ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు ముగిశాయి. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. అవి కలగానే మిగిలాయి. ప్రస్తుతం ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఆదిబట్ల మున్సిపాలిటీ హాట్ టాఫిక్‌గా మారింది. గ్రేటర్‌లో విలీనం అవుతుందనే ప్రచారం జోరుగా సాగుతుండగా.. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్లో కొత నిరాశ నెలకొంది.

అంతర్జాతీయ సంస్థలకు నిలయం

పురపాలిక గ్రేటర్‌లో కలుస్తుందా లేదా అన్నది ఎలా ఉన్నా.. ఇక్కడ ఒక్కసారైనా చైర్మన్ లేదా కౌన్సిలర్ అయితే చాలన్నట్లుగా ఔత్సాహిక నేతలు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే మణికొండ, గచ్చిబౌలి, నార్సింగి లాంటి పురపాలికలకు పోటీగా అభివృద్ధి చెందుతుంది కాబట్టి. అంతర్జాతీయ సంస్థలకు నిలయంగా మారింది. సాఫ్ట్‌వేర్ దిగ్గం టీసీఎస్, టాటా ఏరోస్పేస్, బోయింగ్, ఫాక్స్‌కాన్, కలెక్టరేట్ కార్యాలయం ఇక్కడే ఉన్నాయి. అన్నిటికంటే ముందు ఔటర్‌రింగ్, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఇక్కడి నుంచే వెళ్తుంది. అందుకే రాజకీయ పార్టీల నేతలు, ఆశావహులు ఆలోచనలు అలా ఉంటాయి. ఇక రియల్ వ్యాపారం జోరుమీదుంది. ఇక్కడ ఎకరం భూమి ధర అక్షరాల రూ.10 కోట్ల పై మాటే.

గ్రేటర్‌లో కలవనుందా..

మున్సిపాలిటీ 2018 ఆగస్టు 2న ఏర్పాటు అయింది. అప్పట్లో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్, ఆదిబట్ల, రాందాస్‌పల్లి, మంగళ్‌పల్లి, ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లి గ్రామాలను కలుపుతూ గత ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 15 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 22 వేల జనాభా ఉండగా.. మొన్నటి పార్లమెంటు ఎన్నికల నాటికి 16,072 మంది ఓటర్లు ఉన్నారు. పరిపాలన పరంగా ఆదిబట్లను కేంద్రంగా చేసి పాలన కొనసాగించారు. కానీ ప్రస్తుతం ఇదే ఆదిబట్ల మున్సిపాలిటీ ఉంటుందా.. లేక గ్రేటర్‌లో విలీనం కానుందా అనే చర్చ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గతంలో తొలిసారిగా ఎన్నికలు జరగడం వలన ప్రతి వార్డుకు ఒక్కో రాజకీయ పార్టీ నుంచి ఒకరు చొప్పున పోటీలో నిలవగా, ఒక్క వార్డుకు కనీసం నలుగురు అభ్యర్థులకు తగ్గకుండా పోటీ చేశారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

జనవరి 25తో పురపాలక పాలకవర్గాల పాలన ముగిసింది. నాటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. స్థానిక ఎన్నికల్లో ఈ సారి పోటీ చేయడానికి ఆశావహులు చాలామంది, భారీ అంచనాలతో ఉన్నారు. అయితే విలీనం ప్రచారంతో కొంత నిరుత్సాహంతో ఉన్నారు. 15 వార్డుల్లో ఉన్న నేతలంతా బలమైన వారే కావడం గమనార్హం.

రాజకీయ నిరుద్యోగం తప్పదా..

నగర పాలక సంస్థను నాలుగు భాగాలుగా చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆదిబట్లను ఎల్బీనగర్ జోన్ లేదా, చార్మినార్ డివిజన్‌లో కలపాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ గ్రేటర్‌లో విలీనం చేస్తే.. రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహులు ఆశలు వదులుకోవాల్సిందే. గ్రేటర్ అయితే ఒక్క కార్పొరేటర్ వచ్చే అవకాశం ఉంది. ఒక పదవికి కనీసం ఆరుగురు కంటే ఎక్కువ పోటీ చేయరు. అది ఎక్కువగా పలుకుబడి ఉన్నవారికే సాధ్యం అవుతుంది. కాగా.. గ్రేటర్‌లో కలుస్తుందా, లేక మున్సిపాలిటీగా ఉంటుందా. పోటీలో ఉండాలా వద్దా. అనే సందిగ్ధంలో నాయకులు ఉన్నారు.

సందిగ్ధంలో ఉన్నాం



మున్సిపాలిటీ విలీనంపై నిత్యం చర్చలు జరుగుతున్నాయి. ఔటర్ లోపలి ప్రాంతం గ్రేటర్‌లో కలుస్తుందంటున్నారు. గతంలో పోటీ చేసి భంగపడ్డాము. మరో సారి పోటీ చేసేందుకు ఆశగా ఉన్నాము. మున్సిపాలిటీగా ఉంటేనే బాగుంటుంది. గ్రేటర్ అయితే ప్రజలకు ఇబ్బంది తప్పదు.

– పల్లె గోపాల్‌గౌడ్, ఆదిబట్ల

ఏదైనా సరే..



ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. ప్రభుత్వం, పార్టీ ఆదేశిస్తే అనుకున్న అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేస్తాం. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం. ఆదిబట్లలో గతంలో అత్యధిక సీట్లు గెలిపించాం. గ్రేటర్ అయినా మున్సిపాలిటీ అయినా హస్తందే పై చేయి.

–మర్రి నిరంజన్‌రెడ్డి, మాజీ చైర్మన్

ఆదేశాలు లేవు



విలీనంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గ్రేటర్‌లో కలుస్తున్నట్లు కనీసం మౌఖిక ఆదేశాలు లేవు. వార్త పత్రికలు, టీవీల్లో చూడటం తప్ప. ఎన్నికలు జరపాలంటే, జరుపుతాం. లేదంటే గ్రేటర్ అంటే దానికీ సిద్ధమే.

– బాలకృష్ణ, కమిషనర్


కడ్తాల్: పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు


ఆమనగల్లు: సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ పాండు

'పది'కి సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు ప్రారంభం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

ఆమనగల్లు/ కడ్తాల్: నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కడ్తాల్ ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంతో పాటు ముద్విన్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడారు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏ, బీ సెంటర్లో కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల, మైసిగండి ఆశ్రమ పాఠశాల, కేజీబీవీతో పాటు మరో 3 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ముద్విన్ ఉన్నత పాఠశాల కేంద్రంలో ముద్విన్ ఉన్నత పాఠశాలతో పాటు చరికొండ, ఎక్వాయిపల్లి, ఆకుతోటపల్లి పాఠశాలలకు చెందిన బాలబాలికలు పరీక్ష రాయనున్నారని, మండలంలో మొత్తం 526 మంది పది ఎగ్జామ్ రాయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. బాలబాలికలు పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు.

ఆమనగల్లులో..

ఎస్ఎస్‌సీ పరీక్షలకు పట్టణంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో మొత్తం 537 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఆయా సెంటర్లను ఎంఈఓ పాండు పరిశీలించారు

ఇబ్రహీంపట్నంలో 2,302 మంది

ఇబ్రహీంపట్నం: నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 2,302 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పట్నంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, గురుకుల విద్యాపీఠ్ , ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్(బాలికలు), శాస్త్ర హైస్కూల్, టీఆర్ఆర్ హైస్కూల్, ప్రియాంక స్కూల్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ శేరిగూడలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు


సీఐ శివప్రసాద్

కడ్తాల్: నేటి నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నామని సీఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ముద్విన్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. పరీక్ష జరిగే రోజుల్లో, ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫొటో స్టూడియో లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సిబ్బందికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని సీఐ కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: పేద విద్యార్థుల చదువుకు దాతలు సహకరించాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య కోరారు. ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయశీల వీరారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు చాలీచాలని సౌకర్యాలు కల్పిస్తేనే పేద బిడ్డలు గొప్ప విజయాలు సాధిస్తున్నారని, దాతలు సహకరిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటారని పేర్కొన్నారు. జీవీఆర్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శేఖర్‌రెడ్డి, మండల నాయకుడు సతీష్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, ఫౌండేషన్ అధ్యక్షుడు రాములు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ విఘ్నేష్, సీపీఎం నాయకులు ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు


విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న నాయకులు

నూతన నియామకం


రామకృష్ణ యాదవ్

ఇబ్రహీంపట్నం: యాదవ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర మీడియా అధ్యక్షుడిగా జర్నలిస్టు చీమల రామకృష్ణ యాదవ్‌ను.. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ గురువారం నియమించారు. ఈ సందర్భంగా రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. వెనుకబడిన యాదవ్‌ల అభ్యున్నతికి, హక్కుల సాధనకు కృషి చేస్తానని చెప్పారు. ఈ అవకాశం కల్పించిన రాములుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జర్నలిస్టులు రామకృష్ణను ఘనంగా సన్మానించారు.


ఉత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి మూడు రోజులు
- 22న వేకటేశ్వరస్వామి కల్యాణం

యాచారం: వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు మండల కేంద్రంలోని 200 ఏళ్ల నాటి శ్రీ తిరుమలనాథ ఆలయం ముస్తాబైంది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న స్వామివారికి ఏటా ఉత్సవాలు జరుగుతుంటాయి. ఇక ప్రతి శనివారం మండల నుంచే కాకుండా.. హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలివస్తుంటారు. వారంవారం యాచారం గ్రామానికి చెందిన కొండపురం రాజేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తుంటారు.

గుట్టపైకి మెట్ల మార్గం

ఏటా ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ.. కల్యాణ మంటపం నుంచి 250 అడుగుల ఎత్తు గుట్టపై ఉన్న శ్రీవారిని దర్శించుకోవడానికి సరైన మార్గం లేక భక్తులు ఇబ్బంది పడేవారు. భక్తుల అసౌకర్యాన్ని గుర్తించిన మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి కృషి వలన నాలుగేళ్ల క్రితం కల్యాణ మంటపం నుంచి గుట్టపైకి మెట్ల మార్గం ఏర్పాటు చేశారు. నీటి ఎద్దడి నివారణకు రెండేళ్ల క్రితం చింతపట్ల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ రూ.లక్షకు పైగా నిధులు వెచ్చించి, గుట్టపై బోరుబావి తవ్వించి, మోటార్‌ను బిగించారు. దీంతో ఉత్సవాల సమయంలో నీటి ఎద్దడి తీరింది. తాజాగా ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి.. గుట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలకు లైట్లను అమర్చించారు.


గుట్టపై శ్రీ తిరుమలనాథ దేవాలయం (ఇన్‌సెట్) కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి మూల విరాట్

పూజ కార్యక్రమాలు

స్వామివారి పూజ కార్యక్రమాలు పూజారి హరిబాబు పర్యవేక్షణలో జరగనున్నాయి. 21న సాయంత్రం 6 గంటలకు యాచారం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఉత్సహ మూర్తుల విగ్రహాలను శోభాయాత్రగా కొండపైకి ప్రవేశం, హారతి, ప్రసాద వితరణ. 22న ఉదయం 11 గంటలకు శ్రీ పద్మావతి అలివేలు మంగ శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం. మధ్యాహ్నం అన్నదానం. 23న ఉదయం 7 గంటలకు రథోత్సవం, పూజా, హోమం, కుంభ హారతి. ఉదయం 11.30 గంటల నుంచి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోకి ప్రవేశం. అనంతరం వనం మైసమ్మ వద్ద వన భోజనాలు.

ఇలా చేరుకోవాలి

మహానగరం నుంచి రావాల్సిన భక్తులు సాగర్‌రింగ్‌రోడ్డు నుంచి దేవరకొండ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి యాచారంలో దిగాలి. నల్లగొండ జిల్లా నుంచి వచ్చే వారు దేవరకొండ నుంచి అదే డిపో బస్సుల్లో యాచారానికి చేరుకోవాలి. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే వారు శ్రీశైలం రహదారిపై వచ్చి, కందుకూరు గేట్ వద్ద దిగి, అక్కడి నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న యాచారం చేరుకోవాలి.

వన మహోత్సవానికి సన్నద్ధం

లక్ష్యం చేరుకునేందుకు అధికారుల కసరత్తు

- నిరంతరం నర్సరీల పర్యవేక్షణ


గ్రీన్ హోం నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

షాబాద్/ షాద్‌నగర్‌: పర్యావరణ పరిరక్షణ, ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా పుష్కర కాలం క్రితం హరిత హారం పేరుతో ప్రారంభించిన కార్యక్రమం.. వన మహోత్సవంతో ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగానే జూలై 1 నుంచి ప్రారంభం కానున్న ద్వితీయ వన మహోత్సవానికి ఇప్పటి నుంచే జల్‌పల్లి మున్సిపల్ అధికారులు కార్యాచరణ చేపట్టారు. లక్ష్యం మేరకు నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచుతున్నారు.

నర్సరీల సంఖ్య పెంపు..

హరితహారం తొలినాళ్లల్లో ఇక్కడ నర్సరీ లేకపోవడంతో జీహెచ్ఎంసీని ఆశ్రయించి మొక్కలు దిగుమతి చేసుకునేవారు. స్థానికంగా నర్సరీ ఏర్పాటు చేసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటగా గ్రీన్‌హోం వెంచర్లో నర్సరీని ఏర్పాటు చేసి, పొదుపు సంఘాల మహిళలకు కాంట్రాక్ట్ కింద మొక్కల పెంపకం బాధ్యత అప్పగించారు. ఆ మొక్కలు సరిపోకపోవడంతో అదనంగా పుర కార్యాలయంలోనే మరో నర్సరీ ఏర్పాటు చేశారు. ఇలా రెండు నర్సరీలలో గతేడాది ఏకంగా లక్ష మొక్కలను పెంచారు.

లక్ష్యం1.10 లక్షలు

మున్సిపాలిటీ పరిధి వన మహోత్సవానికి 1.10 లక్షల మొక్కలు నాటడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు సంబంధిత అధికారులు ఇప్పటి నుంచే స్థలాలను అన్వేషిస్తున్నారు. పాఠశాలల ఆవరణలు, యూత్ క్లబ్‌లు, శ్రీశైలం హైవే డివైడర్, రోడ్లకు ఇరువైపులా, ఆర్‌సీఐ రోడ్డుతో పాటు వార్డుల్లో ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. పూలు, పండ్లు, ఔషధ, నీడనిచ్చే తదితర మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

సంరక్షణ ముఖ్యం

ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కలను మినహాయిస్తే బహిరంగ ప్రదేశాల్లో నాటిన వాటి సంరక్షణ బాధ్యతను మున్సిపాలిటీ అధికారులే తీసుకుంటున్నారు. ఇందుకోసం విశ్రాంత ఎఫ్‌ఆర్ఓ ఎం.వి. సుధీర్ మహోత్సవ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఎప్పటికప్పుడు మొక్కల కలుపు, పాదులు తీసి, వాటర్ ట్యాంకుల ద్వారా నీరు పోయడం, ఎక్కడైనా మొక్క ఎండపోయినట్లయితే దాని స్థానంలో వెంటనే కొత్తది నాటేలా చర్యలు తీసుకుంటున్నారు.

మియావాకి విధానం

గ్రామీణ ప్రాంత ఖాళీ స్థలాలు మొక్కలు నాటేందుకు అనువుగా ఉంటాయి. కానీ పట్టణ ప్రాంతాల్లో స్థలం తక్కువగా ఉన్న నేపథ్యంలో మియావాకి విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తక్కువ స్థలంలోనే ఎక్కువ మొక్కలు నాటి అడవుల్లా పెంచే జపాన్ పద్ధతి (మియావాకి) లో.. గతంలో జల్‌పల్లి కమాన్ రోడ్డులోని అటవీ భూమిలో ఆ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆ ప్రాంతం పెద్ద అడవిలా తలపిస్తోంది.

ప్రతి మొక్కను సంరక్షించేలా



ఎన్ని మొక్కలు నాటామన్నది కాదు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం. వన మహోత్సవ లక్ష్యాన్ని ఏటేటా పెంచుతూ పచ్చదనంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రజల సహకారంతో లక్ష్యం చేరుకుంటున్నాం. మానవాళి మనుగడకు జీవనాధారమైన మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

– బి.వెంకట్రామ్, కమిషనర్, జల్‌పల్లి

రేపు మెగా రక్తదాన శిబిరం

ఇబ్రహీంపట్నం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఈ స్మారక ఉత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ఉరి కంబం ఎక్కిన ధీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు అని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ హర్షణీయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్రంలో అట్టడుగు వర్గాల అభివృద్ధికి 42 శాతం రిజర్వేషన్ అమలు హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. గురువారం తుక్కుగూడ పుర కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం పార్టీ శ్రేణులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ రాజకీయ, ఉద్యోగ, విద్యా విధానంలో లభిస్తుందన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసిన రిజర్వేషన్‌ను అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ 42 శాతం రిజర్వేషన్, రాజీవ్ యువవికాసం ఈ మూడు చరిత్రలో నిలిచిపోతయన్నారు. వీటికి ప్రభుత్వం చట్ట భద్రత కలిపిస్తుందని పేర్కొన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, జానకీరామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు పాండురంగారెడ్డి, యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

యాచారం: నేటి నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 15 ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ కలిపి మొత్తం 20 ఉన్నత పాఠశాలల నుంచి 897 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. నందివనపర్తి, యాచారం ఉన్నత పాఠశాల, యాచారం మండల కేంద్రంలోని పుడమి ఉన్నత పాఠశాలలో ఒక్కొక్కటి, గునుగల్ ఆదర్శ పాఠశాలలో రెండు కేంద్రాలు కలిపి మొత్తం ఐదు సెంటర్లను ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి వివరించారు.